క్లుప్తంగా

సత్వరమే ప్రజా సమస్యల పరిష్కారం

- పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి
- గ్రీవెన్స్‌కు ఏడు అర్జీలు



పీజీఆర్ఎస్‌లో అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టమ్) కార్యక్రమం నిర్వహిస్తోందని పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి అన్నారు. వారం వారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి ఏడు అర్జీలు అందినటుఉ ఆర్డీఓ తెలిపారు. అనంతరం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చే ప్రతి అర్జీ సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఉద్దేశ్యంతో డివిజన్ స్థాయిలో అన్ని శాఖల అధికారులు స్పందనకు హాజరయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ వారం నిర్వహించిన స్పందనకు ఆరు ఫిర్యాదులు అందాయన్నారు. ఆయా అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించినట్టు ఆర్డీఓ శ్రీరమణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, గృహ నిర్మాణ శాఖ ఏఈ రవిశంకర్, ఐసిడిఎస్ సీడీపీఓ ఉష, అధికారులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో 20న హుండీల లెక్కింపు

సామర్లకోట: స్థానిక పంచారామక్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 20వ తేదీన హుండీల లెక్కింపు కార్యక్రమం ఉంటుందని ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాలు ముగియడంతో శివరాత్రి నుంచి ఆలయంలోని హుండీల ద్వారా ఆదాయం తెలుసుకోవడానికి లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఈఓ చెప్పారు. ఉత్సవ కమిటీ చైర్మన్, సభ్యులు, భక్త కమిటీ సభ్యులు హుండీల లెక్కింపు కార్యక్రమంలో పాల్గొని సేవలందించాలన్నారు.

విద్యార్థులకు ఫిజియోథెరపీ



సామర్లకోటలో ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న సీఎంఓ, ఎంఈఓ-2

సామర్లకోట: మానసిక దివ్యాంగుల కోసం భవిత కేంద్రాలలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలని సెక్టోరియల్ ఆఫీసర్, సీఎంఓ చామంతి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక భవిత కేంద్రాన్ని పరిశీలించి, విద్యార్థులకు ఇస్తున్న ఫిజియోథెరిపీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం భవిత కేంద్రంలో నైపుణ్యం కలిగిన డాక్టర్లచే ఫిజియోథెరిపీ చేయించారు. తల్లిదండ్రులు ఇక్కడ ఇస్తున్న శిక్షణను పరిశీలించి ఇళ్ల వద్ద తమ తమ మానసిక విద్యాంగులకు శిక్షణ ఇవ్వడం ద్వారా త్వరగా యథార్థ స్థితికి తీసుకు రావచ్చున్నారు. ఈ మేరకు కేంద్రంలోని విద్యార్థుల వివరాలు వారి పరిస్థితిని భవిత కేంద్రం నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 పి.పుల్లయ్య, ఫిజియోథెరిపీ డాక్టరు అపర్ణ, భవిత కేంద్రం టీచర్లు అనిత, పద్మావతి పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



వేట్లపాలెం రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న బొడ్డు వెంకటరమణ చౌదరి

సామర్లకోట: వేట్లపాలెంలో నూతనంగా నిర్మాణం చేసిన రామాలయంలో సోమవారం విగ్రహాల ప్రతిష్ఠ చేశారు. సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొన్ని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ గోలి శ్రీరామ్, మాజీ ఉపసర్పంచ్ వల్లూరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

23న సర్వసభ్య సమావేశం

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయలో 23న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రవికుమార్ సోమవారం తెలిపారు. ఈ సమావేశం ఎంపీపీ కారే సుధా అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికతతో హాజరుకావాలన్నారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు అందరూ తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.



బాగా రాసి వస్తాం....
(పిఠాపురంలో పరీక్ష రాసేందుకు వెళుతూ)



పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులకు జాగ్రత్తలు చెబుతున్న తల్లి



నా రోల్ నంబర్ ఏ రూంలో ఉందో...
(పరీక్షా కేంద్రం వద్ద రోల్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు)



పరీక్ష బాగా రాశాం...
(పరీక్ష అనంతరం బయటకు ఆనందంగా వస్తూ..)



పిఠాపురం పరీక్షా కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులను చెక్ చేస్తున్న సిబ్బంది

పదిష్టంగా పరీక్షలు

- పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు
- అధికారులకు సైతం సెల్ ఫోన్ నిషిద్ధం
- ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు

పిఠాపురం: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటల నుంచే పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల సందడి ప్రారంభమైంది. ఉదయం 9.15 గంటలకు విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించగా తమ రోల్ నంబర్లు ఏ గదుల్లో వచ్చాయో చూసుకోడానికి విద్యార్థులు హడావుడి చేశారు. తొలిరోజు పరీక్ష కావడంతో పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను పరీక్షా కేంద్రానికి తీసుకు వచ్చి దగ్గరుండి పంపించారు. విద్యార్థులంతా నిర్ణీత సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకోవడంతో తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పిఠాపురం నియోజకవర్గంలో పిఠాపురం పట్టణం, పిఠాపురం మండలంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో 1705 మంది విద్యార్థులకు గాను 1698 మంది హాజరవ్వగా ఏడుగురు గైర్హాజరయ్యారు. ఒక సారి ఫెయిల్ అయ్యి మళ్లీ పరీక్షలు రాస్తున్న 12 మంది విద్యార్థుల్లో ఐదుగురు హాజరు కాగా ఏడుగురు గైర్హాజరయ్యారు. గొల్లప్రోలు, గొల్లప్రోలు మండలం పరిధిలో 1133 మంది విద్యార్థులకు గాను 1127 మంది హాజరు కాగా ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పదో తరగతి పరీక్షల ప్రశాంతంగా ప్రారంభమైనట్టు అధికారులు తెలిపారు.

పరీక్షా కేంద్రాల్లోకి నో ఎంట్రీ

ప్రశ్నా పత్రాలు లీకేజీలు జరుగుతున్న నేపథ్యంలో అటువంటి వాటికి అవకాశం లేకుండా ఈసారి పదో తరగతి పరీక్షలు అత్యంత పగడ్బందీగా నిర్వహిస్తున్నారు. పరీక్షా కేంద్రాలకు హాజరయ్యే అధికారులకు సైతం పరీక్షా కేంద్రాల్లో సెల్ ఫోన్ వాడకంపై నిషేధం విధించారు. డ్యూటీ పడిన అధికారులను సైతం క్షుణ్ణంగా తనిఖీలు చేసి సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని లోపలికి అనుమతించారు. ఇతరులను పరీక్షా కేంద్రాల బయటకు మాత్రమే అనుమతించిన అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పిఠాపురం నియోజకవర్గంలోని పిఠాపురం పట్టణంతో పాటు పిఠాపురం మండలంలోని పరీక్షా కేంద్రాలను పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు మధ్యపరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

కొత్తపల్లి: మండల పరిధిలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రసాంతంగా ప్రారంభమయ్యాయి. తెలుగు పరీక్ష జరిగింది. మండల పరిధిలో కొత్తపల్లి వీవీఎస్, మూలపేట, కొమరగిరి, స్థానిక జిల్లా పరిషత్ బాలికలు, బాలురు పాఠశాలకు సంబంధించి 5 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయి. మొత్తం 996 మంది విద్యార్థులు హాజరుకావల్సి ఉండగా 987 మంది రాశారు. 9 విద్యార్థులు గైర్హాజరైనట్లు విద్యాశాఖాధికారి వేణుగోపాల్ తెలిపారు.



కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాల వద్ద విద్యార్థుల సందడి

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు ప్రారంభం

- ఎనిమిది మంది విద్యార్థులు గైర్హాజరు
- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన ఆర్జేడీ

సామర్లకోట: మండల పరిధిలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. 10 పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు 1499 మంది పరీక్షలు రాయవలసి ఉండగా 1491 మంది పరీక్షలు రాసి 8 మంది గైర్హాజరు అయినట్ట మండల విద్యాశాఖాధికారి వై శివరామకృష్ణయ్య తెలిపారు. మండలంలో 782 మంది బాలురకు 780 మంది, 717 మంది బాలికలకు 711 మంది బాలికలు పరీక్షలు రాసిన్నట్టు చెప్పారు. సోమవారం ప్రారంభం అయిన ఈ పరీక్షలు ఏప్రిల్ ఒకటి వరకు జరుగుతాయి. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో 179 మంది విద్యార్థులకు 178 మంది, యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో 108 మందికి 107 మంది వచ్చారు. ప్రభుత్వ హైస్కూల్‌లో 148కి 148 మంది, జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో 139 మందికి 139 మంది, ప్రతిభా విద్యానికేతన్‌లో 159 మందికి 157, ఉండూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 173 మందికి 172 మంది, వీకేరాయపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 139 మందికి 139 మంది, వేట్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ ఎలో 143 మందికి 143, వేట్లపాలెం బిలో 170 మందికి 167 మంది, నవర జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 141 మందికి 141 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్టు తెలిపారు. పట్టణ పరిధిలోని ప్రభుత్వ హైస్కూల్, వేట్లపాలెంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని పరీక్షా కేంద్రాలను ఆర్‌జేడీ నాగమణి తనిఖీ చేశారు. ఈ పరీక్షలను పురస్కరించుకొని సీఐ ఎ.కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు డ్రోన్ కెమేరాతో నిఘా ఏర్పాట్లు చేశారు.



సామర్లకోట హైస్కూల్‌లో హాల్ టిక్కెట్లు పరిశీలించి పరీక్షా కేంద్రంలోనికి పంపుతున్న ఉపాధ్యాయులు

రోడ్డు విస్తరించండి లేదా.. కళాశాల స్థలం వెనక్కి ఇవ్వండి..!

గ్రీవెన్సులో మన ఊరు మన బాధ్యత స్వచ్ఛంద సంస్థ ఫిర్యాదు

పిఠాపురం: రోడ్డు విస్తరణ పూర్తి చేయండి లేదా రోడ్డు విస్తరణ పేరుతో స్వాధీనం చేసుకున్న కళాశాల స్థలాన్ని వెనక్కి ఇవ్వండి అంటూ పిఠాపురానికి చెందిన మన ఊరు మన బాధ్యత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాడా పీడీ ఏ చైత్రవర్షిణికి గ్రీవెన్సులో ఫిర్యాదు చేశారు. సోమవారం పిఠాపురంలో నిర్వహించిన గ్రీవెన్సులో ఫిర్యాదు చేసిన సంస్థ ప్రతినిధులు ఈసందర్భంగా మాట్లాడుతూ పిఠాపురం పట్టణంలో మెయిన్ రోడ్డు పదేళ్ల క్రితం రోడ్డు విస్తరణ పేరుతో అధికారులు ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ కళాశాల స్థలాన్ని తీసుకొన్నారన్నారు. కాని దాని పక్కనే ఉన్న ప్రైవేటు స్థలాలు వదిలేశారన్నారు. దానివల్ల రోడ్డు విస్తరణ పూర్తి గాక రోడ్డు ఇరుకుగా ఉండి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఖాళీ చేసిన స్థలంలో పురపాలక సంఘం చిరు వ్యాపారస్తులను ప్రోత్సహించి ఆ ఖాళీ చేసిన స్థలం ఆక్రమించారని వారు ఆరోపించారు. మిగిలిన ప్రైవేటు స్థలాలు ఖాళీ చేసి రోడ్డు విస్తరణ చేయండి లేకపోతే మా కళాశాల స్థలం మాకు ఇప్పించండి అని ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. సమస్యను పరిష్కారం చేయకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయపోరాటం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు. దీంతో పాటు పిఠాపురం పట్టణంలో ఉన్న సమస్యలు పైన ఫిర్యాదు చేశామన్నారు. పిఠాపురం శ్రీ ఉమా కుక్కుటేశ్వర స్వామి దేవాలయం ఆనుకొని ఉన్న హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియలు చేసిన తరువాత స్నానాలు చేయడానికి నీటి సదుపాయం లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని శ్మశాన వాటికలో బోరు వేయించి వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మన ఊరూ మన బాధ్యత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్ష కార్యదర్శులు కొండేపూడి శంకర్రావు, అల్లవరపు నగేష్, పెమ్మారాజు సత్య రామచంద్రరావు, చింతపల్లి సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.



గ్రీవెన్సులో ఫిర్యాదు చేస్తున్న మన ఊరు మన బాధ్యత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాల్గుణ మాసం స్వామి వారికి ప్రీతైన మూడవ సోమవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. పిఠాపురం మహారాజా గోత్ర నామాలతో ఆలయ పండితులు నిర్వహించిన తొలి అభిషేకం, తొలిపూజలను తిలకించడానికి క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆలయంలోని ఉప ఆలయాలోను ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఉదయం పులిహోర, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామివారిని అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరణలు చేశారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రకటనలే తప్ప ఆచరణ శూన్యం

పెద్దాపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ప్రకటనలే తప్పా ఇచ్చిన హామీలు ఆచరణ శూన్యమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో సోమవారం సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శేషుబాబ్జీ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మికులు, వారి సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఎన్నికల ముందు వేతనాల కోసం భారీ ప్రకటనలు చేసిన బాబు, పవన్ కల్యాణ్‌లు ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే పంచాయతీ వర్కర్స్ బకాయలును చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే ఉద్యమాని తెరతీస్తామని శేషుబాబ్జి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అఖిల భారత ఉపాధ్యక్షుడు బేబీరాణి, జిల్లా కార్యదర్శి చెక్కల రాజ్‌కుమర్, డి.క్రాంతికుమార్, పలివెల వీరబాబు, చంద్రావతి, రాజా, ఈశ్వరరావు, షేక్ పద్మ, నక్కా శ్రీను, మేడిశెట్టి వెంకటరమణ, పద్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శేషుబాబ్జీ

వేలం ద్వారా రూ.18.46 లక్షల ఆదాయం

- మార్కెట్ ఆశీలు, పశువుల, మేకల కబేళా పాటల ఖరారు
- మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహణ



సామర్లకోట మున్సిపాలిటీలో కబేళా వేలం నిర్వహిస్తున్న సిబ్బంది

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో మార్కెట్ ఆశీలు, పశువుల కబేళా నిర్వాహణ, మేకల కబేళా నిర్వాహణకు సంబంధించి మున్సిపాలిటీకి రూ.18.46 లక్షల ఆదాయం వచ్చిన్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. పట్టణ పరిధిలోని రోడ్డు మార్జిన్‌లో వ్యాపారాలు చేసుకొనే వారి నుంచి ఆశీలు వసూలు చేసుకోవడానికి పి.వేమవరం గ్రామానికి చెందిన కర్రి లోవమ్మ రూ.15,90 లక్షలతో హెచ్చు పాటదారుడిగా గుర్తించారు. అదే విధంగా పశువుల కబేళా నిర్వాహణకు మహమ్మద్ షఫీయుల్లా రూ.2,03లక్షలతో హెచ్చుపాటదారునిగాను, మేకల కబేళా నిర్వాహణకు రొట్టా శ్రీనివాసు రూ.53వేలకు హెచ్చు పాటదారునిగా గుర్తించిన్నట్టు కమిషనర్ తెలిపారు. ఈ పాటదారులు ఏప్రిల్ నుంచి ఆయా పాటలలో హక్కులు కలిగి ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్వో కె.శ్యామల, పి. సురేంద్ర కుమార్, మేనేజరు కనకరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్



అనంతలక్ష్మిని సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

పిఠాపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర అధ్యాపకులు వి.అనంతలక్ష్మికి డాక్టరేట్ వచ్చిన సందర్భంగా ఆమెను సోమవారం కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.సుభాషిణి మాట్లాడుతూ అనంతలక్ష్మి విశాఖపట్నం గీతం విశ్వవిద్యాలయం నుంచి ప్రొఫెసర్ డి.సూర్యకళ పర్యవేక్షణలో 'నానో స్పైనల్ ఫెరైట్స్' అనే అంశంపై పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ పట్టా పొందారన్నారు. ఆమె డాక్టరేట్ సాధించడం తమ కళాశాల విజయంగా భావిస్తున్నామన్నారు. ఆమె ఎందిరికో ఆదర్శంగా నిలిచారన్నారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు ఆమెను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన కల్యాణోత్సవాలు



గొంచాల గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద హోమం నిర్వహిస్తున్న పండితులు

- భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరస్వామి ఆలయంలో హోమం, పూర్ణాహుతి
- భారీ అన్నదానం

సామర్లకోట: గొంచాల గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తిశ్రద్ధలతో హోమం, పూర్ణాహుతి, గోపూజలు నిర్వహించారు. ఈనెల 10వ తేదీనుంచి స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆ రోజు రాత్రి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. దీనిలో భాగంగా ప్రతి రోజు సప్తాహ పూజలు నిర్వహించారు. 14వ తేదీన స్వామి వారి చక్రస్నానం, వసంతోత్సవం, శ్రీపుష్ప యోగోత్సవం జరిగిన విషయం తెలిసిందే. కల్యాణ ఉత్సవాలు ముగింపును పురస్కరించు కొని సోమవారం ఏడుగురు దంపతులు పూర్ణాహుతిని జరిపించారు. వీటిని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. గ్రామ సర్పంచ్ చోడిశెట్టి వెంకటరమణ, మాజీ ఉపసర్పంచ్ ముమ్మిడి వెంకటేశ్వరరావు ఆలయ కమిటీ నాయకులు భక్తులకు సేవలందించారు. అనంతరం ఆలయం వద్ద భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కిరణ్ ఆస్పత్రి అధినేతకు సత్కారం

సామర్లకోట: కాకినాడ కిరణ్ కంటి ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టరు డాక్టరు సంకురాత్రి చంద్రశేఖర్‌ను హుస్సేన్‌పురం గ్రామస్తులు సోమవారం సత్కరించారు. ఈ నెల 2వ తేదీన గ్రామంలో కిరణ్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 55 మంది కంటి ఆపరేషన్‌కు ఎంపిక కాగా వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయడంతోపాటు వారి వాహనంలో ఇళ్లకు చేర్చారు. దీంతో కాకినాడలోని కిరణ్ కంటి ఆస్పత్రిలో చంద్రశేఖర్‌ను సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు చల్లా బుజ్జి, కోట అప్పారావు, మార్ని సూర్యారావు, చల్లా వెంకటరమణ, తలారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



చంద్రశేఖర్‌ను సత్కరించిన హుస్సేన్‌పురం గ్రామస్తులు

అర్జీలన్నీ సత్వర పరిష్కారానికి చర్యలు

పిఠాపురం: స్థానిక ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో వచ్చిన ప్రతి అర్జీని సత్వరం పరిష్కరించడానికి అన్ని చర్యలు తీసుకోవాలని పాడా పీడీ చైత్రవర్షిణి అధికారులకు సూచించారు. ఆమె సోమవారం పిఠాపురం పాడా కార్యాలయంలో గ్రీవెన్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సోమవారం పాడా కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల సదస్సు నిర్వహిస్తామన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమతమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు. ఈసదస్సులో మొత్తం 44 అర్జీలు వచ్చాయని వాటిలో రెవెన్యూ 15, మున్సిపాలిటీ 15, ఎక్సైజ్ ఒకటి, ఇతరవి 11 అర్జీలున్నట్టు ఆమె తెలిపారు.



పాడా కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న పాడా పీడీ చైత్రవర్షిణి

ఎడతేగని వ్యాపారం..!



తేగలు కాలుస్తున్న మహిళ



కాకినాడ తుని బీచ్ రోడ్డులో తేగలు అమ్ముతున్న మహిళ



అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఉడకబెట్టిన తేగలు

- సీజన్‌తో సంబంధం లేకుండా తేగల అమ్మకాలు

పిఠాపురం: ప్రతి పంటకు ఒక సీజన్ ఉంటుంది. సీజన్ అయిపోతే అవి కనిపించవు. కాని కొత్తపల్లి, తొండంగి మండలాల కోన ప్రాంతంలో సీజన్‌తో సంబంధం లేకుండా సాగుతోంది తేగల వ్యాపారం. సాధారణంగా తేగలు అక్టోబర్ నుంచి జనవరి వరకు మాత్రమే ఉండే సీజన్‌లో దొరుకుతుంటాయి. కాని ఇక్కడ మాత్రం మార్చి వచ్చినా దొరుకుతుండగా మే నెల వరకు తేగలు అమ్ముతుంటారు. ఇతర ప్రాంతాల్లో ఎక్కడా దొరకని సమయంలో ఇక్కడ తేగలు దొరుకుతుంటాయి. ఇక్కడి వ్యాపారులు తేగల పాతర వేసేటప్పుడే వినూత్న పద్ధతిని అవలంబిస్తుంటారు. తాటి టెంకలను పాతర వేసేటప్పుడు ముందుగా నీటి గుంటలో నానబెట్టి కొన్ని రోజులకు ఒక పాతర చొప్పున వేయడం వల్ల దఫదఫాలుగా తేగల పాతరలు అందుబాటులోకి వచ్చి ఎక్కువ రోజులు అందుబాటులో ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు. ఏది ఏమైనా ఎక్కడా దొరకని సమయంలో ఇక్కడ దొరికే తేగలు కొనడానికి జనం క్యూకడుతుంటారు.